క్లుప్తంగా

చీఫ్ జస్టిస్‌గా బీఆర్ గవాయ్ ఎంపిక హర్షణీయం



నందిగామ రూరల్: ఎస్సీ వర్గీకరణలో రాష్ట్రాలకు రాజ్యాంగపరమైన అధికారం కల్పిస్తూ ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులో సభ్యునిగా ఉన్న బీఆర్ గవాయ్ సుప్రీం కోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా ఎన్నికవటం హర్షణీయమని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణి బాబు పేర్కొన్నారు. బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా మణిబాబు ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు బుధవారం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బొందలపాటి రామకృష్ణ, మన్నెం నారాయణరావు, మట్టా ప్రసాద్, షేక్ సైదా, పెసరమల్లి సురేష్, వేల్పుల ప్రభాకరరావు, ఉప్పులూరి డేవిడ్ రాజ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కొణకంచి(పెనుగంచిప్రోలు): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయుర్వేద వైద్యాధికారి కె.వాణి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో గ్రామస్తులు, విద్యార్థులకు యోగా శిక్షకులు సురేష్, మణి యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా, ధ్యానం వలన శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందన్నారు.

ఆర్థిక సాయం అందజేత



పెనుగంచిప్రోలు: స్థానిక తుఫాన్ కాలనీకి చెందిన చల్లా నరసింహారవు మృతి చెందటంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.11 వేలు సాయం అందించారు. మర్రెబోయిన రామదాసు, వెంకటరమణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు తరుపున బుధవారం ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు, అమ్మవారి ఆలయ ప్రధానార్చకుడు గోపిబాబు మాట్లాడుతూ అమ్మవారి దీక్షతీసుకున్న స్వాముల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు ట్రస్టు ఏర్పాటు చేశామన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కంచికచర్ల: మండలంలో గండేపల్లిలో పంచాయతీలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ మేరకు సర్పంచి బి.రవికుమార్ మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీల్లో చెత్తాచెదారాన్ని తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామన్నారు. మురుగునీరు పారుదల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అన్ని వీధుల్లో శానిటేషన్ అభివృద్ధి పనులు చేపట్టామని బ్లీచింగ్ సున్నం చల్లించామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా డ్రెయినేజీల్లో ఎబేట్ మందును పిచకారీ చేయించామని తెలిపారు. వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశామని సర్పంచి అన్నారు.

శివాజీ విగ్రహ నిర్మాణానికి రూ.5.25 లక్షల విరాళం



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ మహరాజ్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా రూ.5.25 లక్షల విరాళం అందజేశారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) నివాసంలో విరాళం చెక్కును కుమార్‌రాజా ఎమ్మెల్యే తాతయ్య, టీడీపీ నాయకుడు శ్రీరాం చినబాబుతో కలిసి విగ్రహం నిర్మాణ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. హిందూచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, విగ్రహ కోర్ కమిటీ ప్రతినిధులు పబ్బతి నరేంద్ర, సంకా భాస్కర్, అల్లి రవిచంద్, నోముల రఘు, తూములూరి అశోక్, పబ్బతి సత్యనారాయణ, సురేష్, బీజేపీ చారి, శివాజీ మహరాజ్ అభిమానులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు.. భూమికి ఆదరువు

- భూమిలో పెరగనున్న సారం
- పెట్టుబడులు తక్కువ
- దిగుబడులు పెరిగే అవకాశం
- చౌడు విరిగిపోతుందంటున్న అధికారులు



పొలంలో కుప్పలుగా పోసిన సేంద్రియ ఎరువు



ఎరువు పొలంలో చల్లిన తరువాత ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతున్న రైతు

వత్సవాయి: మే నెల మధ్యలోకి వచ్చింది. అడపాదడపా వానలు పడుతున్నాయి. రైతులు అప్పుడే పొలాలను బాగుచేసే పనిలో పడ్డారు. జూన్ మొదటివారం కల్లా పొలాలను శుభ్రం చేసి పంట వేసేందుకు సిద్ధంగా ఉంచుతారు. ఈ క్రమంలో పొలాల్లో సారాన్ని పెంచేందుకు సేంద్రియ ఎరువులను పొలాలకు తోలుకుంటున్నారు. ఇలా భూసారాన్ని పెంచుకోవడంలో రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

రసాయనిక ఎరువులతో..

ఎక్కువ దిగుబడుల కోసం విచ్చలవిడిగా రసాయనికి మందులను వాడుతున్న తరుణంలో సేంద్రియ ఎరువుల ఆవస్యకత ఎక్కువైంది. రసాయనిక ఎరువుల వలన భూమిలో క్షారం క్షీణించి పైర్లకు అధిక స్థాయిలో తెగుళ్లు ఆశిస్తున్నాయి. వీటిని నివారించుకోవాలంటే ప్రకృతి సిద్ధమైన ఎరువును భూమిలో కలపాల్సిన అవసరాన్ని రైతులు గుర్తిస్తున్నారు.

పశువుల వ్యర్థాలతో..

మాగాణి, మెట్ట భూములకు గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకల విసర్జితాలను కోనుగోలు చేసి పంట పొలాలకు తొలుతున్నారు. పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడులు అందించేందుకు దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు. వేరే ప్రాంతాల నుంచి మేత కోసం వచ్చే గొర్రెలు, మేకల కాపరులకు ఎక్కువ డిమాండ్ పలుకుతోంది. పగలంతా వేరే ప్రాంతాలలో మేపుకుని వచ్చి రాత్రికి వారు ఎంచుకున్న పొలంలో వీటిని ఉంచుతారు. ఒక రాత్రి పొలంలో గొర్రెలను ఉంచి నందుకు మందను బట్టి రూ.500 నుంచి 1000 వరకు కాపరులు రైతుల నుంచి తీసుకుంటారు.

చౌడు భూములు సారవంతంగా..

సేంద్రియ ఎరువుల వినియోగం వలన భూమిలో ఉన్న చౌడు విరిగిపోతుంది. అధిక రసాయన ఎరువులను వాడడంవలన భూమిలో ఏర్పడిన చెడు ఫలితాలు అనుకూలంగా మారతాయి. గొర్రెలు, మేకలు, పశువుల వ్యర్థాలు నేరుగా భూమిలోనికి చొచ్చుకుని పోవడం వలన భూసారం పెరుగుతుంది.

పెట్టుబడులు తక్కువ..

ప్రకృతి సిద్ధంగా దొరికే సేంద్రియ ఎరువుల వలన రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుంది. నత్రజని, పొటాష్, భాస్వరం, మేలు చేసే సూక్ష్మ జీవులు అధికంగా పెరుగుతాయి. ఎకరానికి ఐదు ట్రాక్టర్ ట్రక్కుల ఎరువును భూమిలో కలిపితే పది మందుకట్టలు వేసినట్లేనని రైతులు చెబుతుంటారు. సేంద్రియ ఎరువును వినియోగించడం వలన భూమిలో సారం పెరుగుతుంది. దీంతో మొక్క ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించడానికి ఎక్కువ ఉపయోగపడుతుంది. మారిన పరిస్థితులకనుగుణంగా రైతులు ఎక్కువగా దీని వినియోగంపై దృష్టి సారిస్తున్నారు. పశువుల వ్యర్థాలను కోనుగోలు చేసి భూములలో కలుపుతున్నారు.

దిగుబడులు పెరుగుతాయి..

సేంద్రియ ఎరువులను వాడడంవలన భూమిలో సారం పెరిగి దిగుబడులు పెరుగుతాయి. రసాయనిక ఎరువులకు పెట్టే ఖర్చు తగ్గుతుంది. సేంద్రియ ఎరువు భూమిలోకి నేరుగా చొచ్చుకునిపోయి మట్టిలో కలిసిపోతుంది. గొర్రెలు, మేకలు పొలంలో ఉంచిన తరువాత, ఇళ్లలో ఉన్న పశువుల ఎరువును పొలంలో కుప్పలుగా వేయాలి. వెంటనే మనుషుల ద్వారా కుప్పలను చిమ్మించి పొలంలో కలిసిపోయేలా ట్రాక్టర్‌తో దుక్కివేయించుకోవాలి.

– వి.రవికుమార్, మండల వ్యవసాయాధికారి

ఆత్మవిశ్వాసానికి క్రీడలు దోహదం

జగ్గయ్యపేట అర్బన్: క్రీడల వలన శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మ విశ్వాసం పెంపొందు తుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో కేవీసీఏ, బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెట్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ క్రికెట్ క్యాంప్‌ను మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఉచిత క్రికెట్ క్యాంపును నిర్వహిస్తూ పిల్లల్లో క్రికెట్ నైపుణ్యాన్ని పెంపొందిస్తున్న కేడీసీఏ, బీవీ సాగర్ క్రికెట్ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమ్మర్ క్రికెట్ క్యాంపులో శిక్షణ పొందుతున్న వారికి చైర్మన్ రాఘవేంద్ర అల్పాహారం తెప్పించి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు బీవీ సుధీర్, మీసాల మనోజ్, గొల్లపూడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పేటలో క్రీడాకారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

వత్సవాయి: ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు వత్సవాయిలో కార్మికులతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమబోర్డును పనిచేయించి పథకాలను అమలుచేయాలని ఆరు ఏళ్లుగా ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా కార్మికులకు అమలవుతున్న పలు కార్మికచట్టాలను కేంద్ర ప్రభుత్వం యాజమాన్యాలకు అనుకూలంగా కారిమ్కులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందని, ఇవి అమలైతే సంక్షేమ బోర్డులు నిర్వీర్యం అవుతాయన్నారు. సంక్షేమబోర్డు రక్షణ కోసం, లేబర్‌కోడ్స్ రద్దు కోసం కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, వై.వెంకటేశ్వర్లు, డి.శైలజ, మేరమ్మ, ప్రసాదు, రాజేశ్వరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇవ్వాలి

నందిగామ రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, డీఏ, మధ్యంతర భృతి, తదితర అలవెన్సులను అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. ఈ నెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను స్థానిక వాటర్ ట్యాంకుల వద్ద ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి బుధవారం ఆయన విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే జూన్ ఒకటి నుంచి నిరవధిక సమ్మె చేపట్టేందుకు యూనియన్ నిర్ణయించినట్లు చెప్పారు. జీవో నంబరు 36 ప్రకారం జీతాలను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని తెలిపారు. నాయకులు కండెల శ్రీను, పరిమి రవి, దాసు, శ్రావణ్, బ్రహ్మం, కార్మికులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గోపాల్, కార్మికులు

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి..

పెనుగంచిప్రోలు: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు అన్నారు. బుధవారం కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ వర్క్స్, ఎలక్ట్రీషియన్స్, డ్రైవర్లు తదితర విభాగాల్లో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కారిమ్కులు ఉన్నారన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.10,500 వేతనంతో వారు కుటుంబాలను పోషించుకోవటం కష్టంగా మారిందన్నారు. పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు కలెక్టర్ ఆధ్వర్యంలోని వేతనాల కమిటీ నిర్ణయించిన దాని ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టర్ మారినా కార్మికులను మార్చకూడదని, ప్రస్తుతం పనిచేస్తున్న వారిని కొనసాగించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులందరికీ యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, తప్పని సరిగా అందించాలని విన్నవించారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాలు పెంచకపోతే కార్మికులందరినీ కలుపుకుని సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు, పంచాయతీ కార్మికులు వీరబాబు, రాంబాబు, సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి బలం

పెనుగంచిప్రోలు: కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి వెన్నుముక అని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. స్థానిక తంబరేణి ఫంక్షన్ హాల్‌లో బుధవారం వైఎస్సార్ సీపీ గ్రామ కార్యకర్తల సమావేశం పార్టీ మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఎవరికీ భయపడాల్సిన పని లేదన్నారు. 10 నెలల పాలనలోనే కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజల చీత్కారానికి గురవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, జిల్లా కార్యదర్శి చల్లా వైకుంఠరావు, పూసల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చేని కుమారి, నియోజకవర్గ వాణిజ్య, ట్రేడ్ యూనియన్ విభాగం అధ్యక్షుడు దేరంగుల శ్రీనివాసరావు, మెండెం రామారావు, ఎంపీటీసీ సభ్యురాలు చాట్ల సుశీల, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సోమయ్య, సుబ్బాయిగూడెం సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగం ఆదర్శనీయం

జగ్గయ్యపేట అర్బన్: మాతృభూమి కోసం ప్రాణత్యాగం చేసిన మురళీనాయక్ త్యాగం ఆదర్శనీయం అని గోర్‌బాయ్ సేవా సంఘం నాయకులు కొనియాడారు. భారత సైన్యంలో విధులు నిర్వహిస్తూ అమరుడైన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మూడావత్ మురళీనాయక్‌కు అశ్రు నివాళులు అర్పిస్తూ గోర్‌బాయ్ సేవా సంఘం అధ్యక్షుడు లాహోరి బద్దూనాయక్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. బద్దూనాయక్ మాట్లాడుతూ భారత్– పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ చూపించిన తెగువ, ఆయన త్యాగం దేశంలోని ప్రతి పౌరునికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. సేవా సంఘం ఉపాధ్యక్షుడు భూక్యా బద్యానాయక్, కోశాధికారి కృష్ణారావు, మాజీ సబ్ రిజిస్ట్రార్ రాజునాయక్, సంఘ ప్రతినిధులు సేవ్యానాయక్, ధరావత్ సత్యం నాయక్, డాక్టర్ శ్రీనివాసరావు నాయక్, మోహన్‌దాయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న గోర్‌బాయ్ సేవా సంఘం ప్రతినిధులు

17న ఆలయ భూముల కౌలుహక్కులకు వేలం

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి ఆలయానికి చెందిన వ్యవసాయ భూములకు టెండర్ కం బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో నరసింహమూర్తి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకట లక్ష్మీ సాయిబాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి చెందిన సుమారు 51 ఎకరాలకు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో కౌలు హక్కులకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు కౌలు వేలంలో పాల్గొనాలని కోరారు.

చీరల వేలం.. కానుకల హుండీ లెక్కింపు..

గ్రామంలోని లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు ఆలయ ఆవరణలో ఈ నెల 17న సాయంత్రం మూడు గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో, ధర్మకర్త తెలిపారు. లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి ఆలయ ఆవరణలో ఈ నెల 19న ఉదయం 11 గంటలకు హుండీ కానుకలు లెక్కిస్తున్నట్లు ఈవో తెలిపారు. చీరల వేలం, హుండీ కానుకల లెక్కింపులో ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని కోరారు.

ముగిసిన నరసింహస్వామి కల్యాణోత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవాలు బుధవారం రాత్రి పవళింపు సేవతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు, శ్రీధరాచార్యులు, మురళీధరాచార్యులు ఆధ్వర్యంలో ద్వాదశ సేవలు, 12 ఆరగింపులు, పుష్పయాగం, పర్యాంకాసనోత్సవ సేవలను నిర్వహించి కల్యాణోత్సవాలు ముగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సురేష్‌బాబు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు.. పట్టించుకోని అధికారులు

కంచికచర్ల: వర్షాకాలం కాదు.. మండు వేసవికాలంలో రోడ్లపైనే మురుగునీరు దర్శనమిస్తున్నాయి. రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు తీవ్రమై దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వసంత కాలనీలో రోడ్లపైనే మురుగునీరు పారుదల కాకుండా నిల్వ ఉంటోంది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు ఉన్నా అవి పూడిక తీయకపోవటంతో ఇళ్లలో వాడుకునే నీరంతా రోడ్డుపైకి వస్తున్నాయి. రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీటిలో వాహదారులు పల్టీకొడుతున్నారని పాదచారుల సైతం జారి పడిపోతున్నారని ఆరోపిస్తున్నారు. మూసుకుపోయిన డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల కోసం పంచాయతీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టటంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం న్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు లేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కంచికచర్ల వసంతకాలనీలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

ఘనంగా ముత్యాలమ్మ, నాభిశిల ప్రతిష్ఠ

వీరులపాడు: మండలంలోని చెన్నారావుపాలెం గ్రామంలోని ముత్యాలమ్మ, నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుమారస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.20 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ నాయకులు పత్తిపాటి మల్లికార్జునరావు, ఎర్రగుంట కృష్ణారావు, మల్లెల గురవయ్య, దాములూరి మల్లికార్జునరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పూజలు..

చెన్నారావుపాలెం గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారు, నాభిశిల ప్రతిష్ఠా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు, దాతల సహకారంతో అత్యంత వైభవంగా ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. సర్పంచ్ పత్తిపాటి మల్లికార్జునరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠా మహోత్సవంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఆటపాటలతో గ్రంథాలయాల్లో శిక్షణ

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రామానికి చెందిన జగ్గయ్యపేట జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు కొనకంచి శంకరరావు భారతదేశపు మ్యాప్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ప్యాడ్లు, పెన్సిళ్లు, పండ్లు అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

జాతీయ పతాకంపై విద్యార్థులకు అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఉపాధ్యాయుడు పర్చా లక్ష్మణరావు విద్యార్థులకు జాతీయ పతాకంలోని మూడు రంగుల విశిష్టత, జాతీయ పతాకం మధ్యలో ఉన్న అశోక ధర్మచక్రం గురించి అవగాహన కల్పించారు. జాతీయ పతాకం చేత పట్టుకొని పాట పాడుతూ అభినయం చేశారు. గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, ఎస్‌జీఎస్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జీడీవీ ప్రసాద్, కవి, ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు, గ్రంథాలయం సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయుడు శంకరరావు

వైభవంగా తిరునాళ్ల మహోత్సవాలు

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడు గ్రామంలో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తిరునాళ్ల మహోత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద గేయాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో నరసింహమూర్తి, వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మీ సాయి బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ మంత్రి నెట్టెం రఘురాం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంధం ఉత్సవాలు

నందిగామ టౌన్: హజరత్ సయ్యద్ షా మీరా హుస్సేనీ ఖాదరి రహమతుల్లా అలై వారి గంధం ఉత్సవాలను ఈ నెల 15,16 తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా ముజావర్లు బాషా, జానీ, హనీఫ్ బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం స్థానిక పెద్ద మసీదు ఆవరణలోని హజరత్ సయ్యద్ షా మీరా హుస్సేనీ ఖాదరి గంధం మహోత్సవాలలో భాగంగా పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన హజ్రత్ గంధం మహోత్సవం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న గౌసుల్లా ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా బయలుదేరి దర్గా షరీఫ్‌కు చేరుకుంటుందని తెలిపారు. శుక్రవారం రాత్రి దర్గా షరీఫ్‌లో హజ్రత్ చిరాగా (దీపారాధన) జరుగుతుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముజావర్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో పాల్గొని గంధం ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

రశీదుల్లో పూర్తి వివరాలు నమోదు చేయాలి



నందిగామ టౌన్: రశీదుల్లో నికర బరువు, ధర, స్వచ్ఛత (క్యారెట్), తదితర పూర్తి వివరాలను నమోదు చేయాలని లీగల్ మెట్రాలజీ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ భానుప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 20న అంతర్జాతీయ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జ్యూయలరీ అండ్ బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో జ్యూయలరీ దుకాణదారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాళ్ల ఆభరణాలలో బంగారం, రాళ్లకు వేర్వేరుగా తూకం వేయాలన్నారు. బంగారం వెయింగ్ మెషీన్‌లపై లీగల్ మెట్రాలజీ శాఖ సీల్ ఉండాలని, సీల్ లేని మెషీన్‌లు వాడితే చర్యలు తప్పవన్నారు. అనంతరం కాటాలు, ఆభరణాలపై ట్యాగులు, తూకం వేసే విధానాలపై అవగాహన కలిగించారు. స్థానిక జ్యూయలరీ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.